# కుసుమ జయభేరి

తెలుగు సాహిత్య సాంస్కృతిక e - మాస పత్రిక



సంపుటి-10 సంచిక-1 ఆగస్టు-2025 ఎడిటర్ - డాక్టర్ రాధా కుసుమ


## స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు...










Ph: +91 99892 41319 | Email: kusumajayabheri@gmail.com



www.kusumajayabheri.org

# వ్యాసాలు


## తెలుగు కళారంగం ఆవశ్యకత. (ఆచారం, ప్రచారం)

ఏ జాతికైనా ఆ జాతి యొక్క సంస్కృతి, సాంప్రదాయమే జీవగర్ర. ఒక జాతిలో నివసిస్తున్న ప్రజల యొక్క కళలు, క్రీడలు... అన్నీ కలగలసినదే సంస్కృతి. వివరంగా చెప్పాలంటే, సంస్కృతి అంటే ఒక జాతి లేదా సమూహంలో నివసిస్తున్న ప్రజలు విశ్వసించే కళలు, అభిమానించే క్రీడలు, జీవన విధానంలో నమ్మకాలు, మత పరమైన ఆచార వ్యవహారాలు, భాష, భావన, దృక్పథం అన్ని కలగలిసినదే సంస్కృతి. ఇందులో కళలు అనేవి సాంస్కృతిక అభివ్యక్తీకరణకు ప్రతీకలుగా నిలుస్తున్నాయి అనడానికి అతిశయోకి లేదు. కళాకారులు వాటిని ముందుకు తీసుకెళ్తూ కళలను ప్రచారం చేస్తూ, మనజాతి గొప్పతనాన్ని నలుమూలలు వ్యాపింప జేయ గలిగే వారధులు చరిత్రను గుర్తుచేస్తూ ఆనాటి కట్టు బొట్టు ఆచారం, సంప్రదాయం, వ్యవహారం వంటివి ఒక చక్కని లలిత కళారూపకంగా వ్యక్త పరుస్తూ విజ్ఞ్యానంతో వినోదంతో పాటు మానసిక ఆనందం, ఉల్లాసం కలిగేలా, కళాకారులు మనకు అందిస్తారు.

## ఆనాడు ఒక బోయవాడు ముందు మన చరిత్ర

### ఇటువంటి ఘనమైన సంస్కృతి దగ్గర "మన కళల గొప్పతనం":

ఆనాడు ఒక బోయవాడు పూర్వజన్మ సుకృతం వల్ల రామాయణం అనే ఇతిహాసాన్ని లిఖించి ఉండకపోతే, వాల్మీకి మహర్షి యొక్క పరిణామం వల్ల కలిగిన లాభం మనం తెలుసుకునే వాళ్ళం కాదు. రామాయణ మహా కావ్యాన్ని శ్రీరామచంద్రుని గుణవిశేషాలను కీర్తించ గలిగేవారమా...



అలాగే వేదవేదాంగాలు, పురాణేతిహాసాలు, అష్టాదశపురాణాలు వంటివి వ్యాస మహర్షి ద్వారా మనకు అందడం వల్ల మన చరిత్ర ఎంత గొప్పదో, మన సంస్కృతి అతిప్రాచీన మైనా నిత్య నూతనమని తెలుసుకున్నాం.

ఇటువంటి ఘనమైన సంస్కృతిని లలితకళల ద్వారా, ప్రజలందరికీ అందించ గలిగే అనేక మాధ్యమాలు, ప్రక్రియలు మనకు అందుబాటులో వున్నాయి. కళాకారులు వారి నైపుణ్యాతో, కల్పనా శక్తితో అనేక రకాలైన కళా రూపకం గా అందరికీ అందిస్తున్నారు. పట్టణాలలో ఒక రకంగా, పల్లెలలో ఒక రూపంగా కాలమాన పరిస్థితుల కనుగుణంగా ప్రజలకు అందిస్తున్నారు, కొన్ని కళలు మరుగున పడినా అన్ని కళలూ నేటి తరానికి అందక పోయినా, ఉన్న కళలను ఆదరించి, పోషించి, పైకి తీసుకురావటం మనందరి కర్తవ్యం. అన్ని కళారూపాలు ఆధునికతను సంతరించుకోలేక పోవచ్చు. కానీ ఏ కళనైనా ఆదరించి, ప్రదర్శించడానికి అనుకూల వాతావరణాన్ని కల్పించటం మన బాధ్యత.


మహా పురుషులు వ్రాసిన గ్రంథాల ఆధారంగా రూపురేఖలను శిలలపై చెక్కిన శిల్పులు, రామునికి, కృష్ణునికి ఇతర పాత్రలకి రంగురంగుల ఆకారాలు కల్పించిన చిత్రలేఖకులు, వారి మహిమలను గొప్పతనాలను అద్భుతంగా గానం చేసిన గాయకులు, ఆనాటి పాత్రలను ధరించి సజీవంగా వేదికపై నిలిపి వారి హావభావాలను రసవంతంగా మనకు అందించిన నృత్య మరియు నాటక కళాకారులు అందరూ మన సాంస్కృతిక వారధులే అని ఘంటాపథంగా చెప్పవచ్చు. ఈ కళాకారులందరూ కూడా ఆయా కాలాలలో ప్రజలను రంజింప చేయడానికి వారి వారి కళా కౌశలాన్ని నిరంతరం మెరుగుపరుచుకుంటూ ప్రజల అభిరుచులలో వచ్చిన మార్పులకు అనుగుణంగా తమను తాము కాలాను గుణంగా మార్చుకుంటూ సాంస్కృతిక ప్రయాణంలో కలిసి పయనించిన కారణంగానే, నేటికీ ఆ కళలు సజీవంగా నిలిచిపోయాయి. కళాకారులు కూడా చక్కటి క్రమశిక్షణ కలిగి మనోధర్మంతో కళను అభివృద్ధి పరచి, మారిన కాలానికి అనుగుణంగా ప్రదర్శించ గలగాలి.

ఈనాటి ప్రజలకు కొత్తదనం కావాలంటే పాత కళలను కూడా, కొంగ్రొత్త ప్రక్రియలతో సమాజ భాద్యత కలిగి అందిస్తే, తప్పక విజయ వంతమవుతాయి. ఎటువంటి కళారూపమైనా, సమాజ శ్రేయస్సుని దృష్టిలో ఉంచుకుని, సృజనాత్మకతతో ప్రజల ముందుకు తీసుకెళ్తే రాజపోషకులు, కళారాధకులు కొల్లలుగా ఉంటారు. మానసికానందం, మానసిక వికాసానికి కళలు ఎంతైనా దోహద పడతాయి, అంటే అతిశయోక్తి కాదు.

## ఇబ్బంది కరమైన పరిస్థితులు:

కొన్ని కాలమాన పరిస్థితులకు అనుగుణంగా మారని కళలు కనుమరుగైపోయాయి. ఒకప్పుడు విజ్ఞానాన్ని వినోదాన్ని అందిస్తూ తెలుగు నాట తరతరాలుగా అద్భుతంగా వెలసిల్లిన అనేక జానపద కళలు నేటి తరానికి చేరకుండానే అంతరించిపోయాయి. ఇది చాలా బాధాకరమైన విషయం. వీటికి కారణాలు అనేకం ఉన్నా అలాంటి

కళలన్నీ నేటి తరానికి తగినట్టుగా ఆధునికత సంతరించుకోకపోవడం వాటి పతనానికి ప్రధాన కారణం అని చెప్పక తప్పదు. ఏదైనా ఒక కళ అంతరించడానికి ముందుగా మనకు కొన్ని లక్షణాలు కనబడతాయి. అలాంటి కళను ఆదరించే వారు లేక ప్రదర్శించే కళాకారులు పేదలుగా మారడం. తద్వారా ఆ కళాకారులను కళారూపాలను మిగిలిన ప్రజలు చిన్న చూపు చూడడం, తద్వారా వాళ్లు వేరే వృత్తుల ను ఆశ్రయించుకుని వెళ్లడం అందులో ప్రధానమైనది, ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి కూడా. ఈ పరిస్థితులు నేడు పద్య నాటకానికి, రూపకాలకు ఏర్పడుతున్నాయి. ప్రజలను తేజోవంతులను చేయడం, ఉత్సాహ పరచడం, చైతన్యం చేయడం లాంటివి ప్రభుత్వ అనుగుణ సంస్థలు, సాహిత్య కళారంగాల సంస్థలు ప్రజలకు ప్రోత్సాహం ఇస్తే కొంత మేరకు అనేక కళా రంగాల వారు ముందుకు వస్తారు. కావున, కళలను ఆదరించని ప్రజలను నిందించడం భావ్యం కాదు. ప్రజలకు కావలసింది కొత్తదనం, వినోదం, ఆహ్లాదకరం. ఇలాంటివి ఎక్కడ దొరికితే అక్కడికి వెళ్ళిపోతారు. వారికి నచ్చేటట్లుగా నూతన పోకడలతో, విన్నూతంగా తమని తాను మార్చుకుంటూ సమాజంలో ఉన్న తప్పు ఒప్పులను ప్రతిక్షేపిస్తూ విజ్ఞానంతో కూడిన వినోదాన్ని అందించడం కళాకారుల మరియు కళా సంస్థల యొక్క బాధ్యత ప్రథమ కర్తవ్యం కూడా.



**Mantri Pragada Markandeyulu, Litt.D.,**
+91-9951038802
Hyderabad-India



# “సర్దుకున్నారా” - ప్రభాకర్ జైని గారి కథ

రచన: కొత్త ప్రియాంక (భానుప్రియ)
హైదరాబాద్




“సర్దుకున్నారా” అనే కథ పేరు చూడగానే మొదట మనం ప్రయాణించే దూరాలకు మనకు కావలసిన వస్తువులు సర్దుకున్నారా అనే దృక్పథంతో కథ చదవడం మొదలు పెట్టాను.

కానీ చదివాక కానీ తెలియలేదు . జీవన ప్రయాణ గమ్యంలో ఏ క్షణంలో ఎవరం ఎప్పుడు పరలోకానికి పైనమవుతారో...

ఆ పయనం అయ్యే లోపటే మనం మన జీవితంలో ఆనందాన్ని ఆప్యాయతలను మమతానురాగాలను, బాధ్యతలను సర్దుకోవాలి అని ఈ కథ చదివాక తెలిసింది. సర్దుకున్నారా అనే పేరు పెట్టి ఈ కథకు 100 శాతం సార్ధకత చేకూర్చారు రచయిత.

ఈ కథలో రెండు భాగాలుగా చూస్తే మొదటి భాగంలో రమణ అనే పాత్ర ద్వారా వయసు అనేది శరీరానికే తప్ప మనసుకు కాదు అని , జీవితం క్షణబంగుర కాలమని అందుకే ప్రతి క్షణాన్ని ఆస్వాదిస్తూ, ఆనందిస్తూ, అందరిని నవ్విస్తూ , తుల్లుతూ సాగిపోవాలని రచయిత రమణ పాత్రను చాలా పాజిటివ్ ఆటిట్యూడ్ తో చెప్పడంలో ఈ కథ వాస్తవికతకు దర్పణంలా సాగింది. మన జీవితం చాలా చిన్నదని కోపాలతో తాపాలతో ఆత్మీయతలను ఆప్యాయతలను కోల్పోతూ ప్రతిక్షణం బాధపడుతూ నిరాశ నిస్పృహలతో సాగిపోకుండా మనం ఉన్నప్పుడే మన బాధ్యతలకు,బంధాలకు, ప్రేమకు విలువనిస్తూ గతించిన కాలాన్ని విడిచి, కోపాన్ని మరిచి ప్రేమానురాగాలతో ఒక్కటవ్వాలని మన జీవితం ఉన్నప్పుడే అన్ని సర్దుకోవాలని చెప్పడంలో రచయిత ప్రతి ఒక్కరి హృదయాలను ఆలోచింప చేశారు.

రమణ పాత్ర ద్వారా వయసుతో సంబంధం లేకుండా ఎప్పుడూ హుషారుగా

ఎదుటివారిలో సైతం ఆనందం నింపుతూ ముసలితనం అని కూర్చోక జీవిత సారాన్ని కడవరకు ఆస్వాదించాలని చెప్పిన విధానం నా మనసును చాలా ఆకట్టుకుంది. రమణ పాత్ర ముగింపు కూడా చాలా హృద్యంగా మలిచిన తీరు ఆకట్టుకుంది, ఆలోచింపచేసే విధంగా ఉంది.దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్క పెట్టుకోవాలని నానుడికి సరిపోయే విధంగా మనం ఉన్నప్పుడే బంధాల విలువ తెలుసుకొని బాధ్యతల విలువ తెలుసుకొని, మన ద్వారా బాధపడిన ప్రతి హృదయాన్ని ఆనందం నింపే దిశగా సాగిపోవాలని సర్దుకోవాలని చెప్పిన తీరు రమణ పాత్ర ద్వారా చాలా హృద్యంగా వర్ణించారు.

నేను నా జీవితం గమనంలో అన్ని సర్దుకున్నాను. ఇప్పుడు నా మనసు ఎంతో ఆనందంతో ఎప్పుడైనా నేను మరణించడానికి సిద్ధమని చెప్పిన తీరు ప్రతి ఒక్కరిని ఆలోచింప చేసే విధంగా ఆవిష్కరించడంలో రచయిత గారు విజయం సాధించారు. ఉద్యోగాల నుంచి రిటైర్డ్ అవ్వడం అంటే జీవితం నుంచి రిటైర్డ్ అవ్వడం కాదు అని, శేష జీవితమంటే అన్ని వదిలేసి బతకడం కాదని "విశేష జీవితం" గడపాలని రచయిత తెలిపిన తీరు ఆకట్టుకునేలా మలిచిన తీరు కడుకమనీయం.

రమణ మరణించినాక తన స్నేహితుడు కూడా జీవితంలో నేను కూడా అన్ని సర్దేస్కోకుండానే నా జీవన పయనం ముగించకూడదని నిర్ణయం తీసుకొని తాను తన భార్య ను కోల్పోయిన తన కూతురు ప్రేమ, వాత్సల్యాన్ని తిరిగి పొందాలని తన అహంకారాన్ని పక్కనపెట్టి నా జీవన చరణాంకంలో రమణ చెప్పినట్టుగా సర్దుకోవాలని నిర్ణయించుకోవడం తన కూతురిని చేరుకొని ఇన్నాళ్లు తాను కోల్పోయిన ప్రేమను, తన కూతురిని ఇబ్బందికి గురి చేశానని తన గుండెకు హత్తుకోవడం తన ఆవేదనను వ్యక్తపరిచిన తీరు హృదయ విధారకంగా మలిచిన తీరు అందరినీ ఆకట్టుకునేలా సాగిపోయింది.



అలా మన జీవితంలో కూడా ఎలాంటి బాకీలు లేకుండా మన అయిన వారందరికీ, శత్రువులందరికీ మిత్రులందరికీ మన ప్రేమను, కృతజ్ఞతను వ్యక్తపరచుకొని సర్దుకోండి అని, నేను అన్ని సర్దుకున్నాను మీరు సర్దుకున్నారా అని అందరి హృదయాలను ఆలోచింపజేసే విధంగా సాగిన మీ కథకు అభినందనలు వందనాలు

# అంతర్జాతీయ జానపద విజ్ఞాన దినోత్సవ శుభాకాంక్షలు







మన జన జీవన సంస్కృతికి
ప్రతిబింబాలైన జానపద కళలను పరిరక్షించుకోవాల్సిన
బాధ్యత ఎంతైనా ఉంది




## కుసుమ జయభేరి

తెలుగు సాహిత్య సాంస్కృతిక e - మాస పత్రిక



Ph: +91 99892 41319 | Email: kusumajayabheri@gmail.com



www.kusumajayabheri.org